

టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో నేడు సంక్రాంతి సంబరాలు

బెంగళూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు జరగనున్నాయి. సర్జాపుర రోడ్డులోని కొడతి గ్రామం ఆస్కా టర్ఫ్ గ్రౌండ్‌లో కార్యక్రమాలు ఉంటాయని ప్రకటనలో తెలిపారు. పాత స్మృతులను మళ్లీ నెమరు వేసుకునేలా కార్యక్రమాలు ఉంటాయన్నారు. అభిమానులు, కార్యకర్తలు అందరూ సకుటుంబ సపరివారంగా సరదాగా పాల్గొనవచ్చని పేర్కొన్నారు.



అంతా రామమయం





ఆర్‌టీ నగర్‌లో ఏర్పాటు చేసిన శ్రీరాముడి భారీ కటౌట్

- రాష్ట్రమంతటా రాములోరి సందడి
- పలుచోట్ల అయోధ్య ప్రత్యక్ష ప్రసారాలకు ఏర్పాట్లు

బెంగళూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామమందిరం ప్రారంభ నేపథ్యంలో రాష్ట్రమంతటా సందడి ప్రారంభమైంది. బెంగళూరుతోపాటు వివిధ ప్రాంతాల్లో కాషాయం రెపరెపలాడుతోంది. మైసూరు, మంగళూరు, బెళగావి, ధారవాడ, బాగల్కోటె, విజయపుర జిల్లాల్లో ప్రతి చోటా భారీగా రాముడి కటౌట్లు, హోర్డింగులు ఏర్పాటు చేస్తున్నారు. అన్ని ఆలయాలలోనూ విశేష పూజలు జరగనున్నాయి. మరోవైపు ప్రాంతాలవారిగా అయోధ్యలో జరిగే కార్యక్రమాలను నేరుగా వీక్షించే వెసులుబాటును కల్పిస్తున్నారు. బెంగళూరు దక్షిణలో శ్రీరామ ఉత్సవ, లక్ష దీపోత్సవ భజనలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీ తేజస్వి సూర్య ప్రకటించారు. పద్మనాభనగర్‌లోని కార్మెల్ స్కూల్ మైదానంలో సోమవారం సాయంత్రం 5 గంటలనుంచి ప్రముఖ గాయకులు విజయ్‌ప్రకాశ్, అరుణ్ డీ రావ్ సంగీత కచేరీ ఉంటుందన్నారు. 500మందికి పైగా చిన్నారులు సీతారామలక్ష్మణ హనుమంత వేషధారణతో నృత్యం చేస్తారని వివరించారు.

ఓరియన్‌లో ప్రత్యక్ష ప్రసారం

అయోధ్యలో రామలల్లా విగ్రహ ప్రతిష్ఠాపన ప్రత్యక్ష ప్రసారాన్ని రాజాజినగర్ బ్రిగేడ్ గేట్‌వే ఓరియన్‌మాల్‌లో ప్రసారం చేయనున్నట్లు ప్రకటించారు. మాల్‌ను సందర్శించేవారు అయోధ్యలో జరిగే పూజా కార్యక్రమాలను నేరుగా తిలకించేలా తగిన ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12.20 గంటలకు ప్రసారాలను ప్రత్యక్షంగా వీక్షించవచ్చునన్నారు.

మూడు దశాబ్దాల కల సాకారం

- కరసేవకుడిగా జన్మ ధన్యం ● మాజీ మంత్రి లింబావళి



మహదేవపుర, జనవరి 20: అయోధ్య భవ్య రామమందిరం ప్రారంభం కోసం దేశ వ్యాప్తంగా ప్రజలు ఎదురు చూస్తున్నారని, శ్రీరాముడి విగ్రహ పునఃప్రతిష్ఠాపనకు సాక్షిగా ఉన్న వారిలో తాను కూడా ఒకడు కావడం తన జన్మ ధన్యమైనట్టుగా భావిస్తున్నానని మాజీ మంత్రి అరవింద లింబావళి తెలిపారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ అయోధ్యలో 32 ఏళ్ల కల సాకారమవుతోందని సంతోషం వ్యక్తం చేశారు. అప్పటి ఘటనలను పంచుకున్నారు. 1992లో కాన్పూర్‌లో ఏబీవీపీ సమావేశంలో పాల్గొని వాపసు వచ్చిన కొన్ని రోజులకే కరసేవకుడిగా అయోధ్యకు వెళ్లాలని సూచించారని తెలిపారు. దీంతో బెంగళూరు నుంచి ఉత్తరప్రదేశ్‌వైపు ఏబీవీపీ ఆధ్వర్యంలో తాను బయల్దేరగా, బీజేపీ తరపున యడియూరప్ప, రామచంద్రేగౌడ, డీహెచ్ శంకరమూర్తి తదితరులు ఉన్నారన్నారు. అప్పట్లో కల్యాణ్‌సింగ్ ప్రభుత్వం ఉండడంతో అయోధ్యలో ప్రవేశానికి ఇబ్బందులు కాలేదన్నారు. ప్రతి రాష్ట్రంలోనూ కరసేవకులైన తమకు ఆత్మీయ స్వాగతం లభించిందన్నారు. ఒక చోట మాత్రం కొందరు తాము ప్రయాణిస్తున్న రైలుపై దాడికి ప్రయత్నించగా స్థానిక బుడకట్టు సామాజిక వర్గీయులు రక్షించారన్నారు. అయోధ్యకు చేరేవేళ వివాదాస్పద కట్టడాల చుట్టూ తిరిగామని, రాముడి దర్శనం చేసుకుని, ప్రసంగాలు విన్నామన్నారు. ఒక్కో చోట ప్రత్యేక టెంట్ ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ తదితర సంఘాల నాయకులు వచ్చి ప్రసంగాలు చేసేవారన్నారు. వివాదాస్పద కట్టడాన్ని ధ్వంసం చేయాలన్న తేదీకి రెండు రోజుల ముందు వాటి వెనుక గుంతలు తవ్వి మట్టి వేయడం ద్వారా కరసేవను పూర్తి చేయాలని సూచించారన్నారు. ఆందోళనల మధ్య ఉదయం నుంచి సాయంత్రం వరకు వివాదాస్పద భవనం ధ్వంసం నిరంతరంగా సాగిందన్నారు. అనంతరం ధ్వంసం చేసిన ప్రదేశంలోనే రాముడి పునఃప్రతిష్ఠాపన చేసేందుకు తీర్మానించారన్నారు. ఈ కార్యక్రమాన్ని పెజావర మఠాధిపతి నెరవేర్చాల్సి ఉండేదన్నారు. కొన్ని రోజులకే ఎమర్జెన్సీ విధించారని ఇలా అప్పటి ఘటనలను గుర్తు చేసుకున్నారు. అయోధ్యలో రామమందిర పునఃప్రతిష్ఠాపన కల సాకారం అవుతుండడం సంతోషంగా ఉందన్నారు.



కరసేవలో పాల్గొన్న సందర్భంగా అరవింద లింబావళి (ఫైల్)

అయోధ్యకు తరలిన మఠాధిపతులు

బెంగళూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామలల్ల విగ్రహ ప్రతిష్ఠాపనకు రాష్ట్రంలోని పలువురు మఠాధిపతులు శనివారం బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి బయలు దేరారు. వారిలో కనకగురు పీఠం నిరంజనానంద స్వామిజీ, మాదార చెన్నయ్య గురు పీఠం చిత్రదుర్గ బసవమూర్తి మాదార చెన్నయ్యస్వామిజీ, జగద్గురు కుంచటిగ మహాసంస్థాన హొసదుర్గ మఠాధిపతి శాంతవీర స్వామిజీ, సిద్దరామేశ్వర మహాసంస్థాన బోవి గురుపీఠం ఇమ్మడి సిద్దరామయ్య స్వామిజీ, వాల్మీకి గురుపీఠం హరిహరకు చెందిన వాల్మీకి ప్రసన్నానంద స్వామిజీ, పంచమసాలి గురుపీఠం వచనానందస్వామిజీ, భగీరథ పీఠం పురుషోత్తమానందపురి స్వామిజీ ఉన్నారు. స్వామిజీలకు సంబంధించిన ఫొటోను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. కాగా అయోధ్య రామమందిర ఆహ్వానపత్రిక రావడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ప్రముఖ నటుడు, కాంతార ఫేం రిషబ్‌శెట్టి ప్రకటించారు.



విమానాశ్రయంలో మఠాధిపతుల బృందం

ప్రశ్న పత్రం లీకేజీకి డీల్

- ఇంటెలిజెన్స్ ఎస్‌ఐపై విద్యార్థి సంఘం ఫిర్యాదు
- ఈనెల 23న ఎస్‌ఐ పరీక్షలు ● ఆందోళన వద్దు : హోంశాఖమంత్రి



బెంగళూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ పరీక్షల వేళ భారీ అవినీతి చోటు చేసుకుని ఏకంగా పరీక్షలను రద్దు చేసిన విషయం దేశవ్యాప్తంగా తలదించుకునేలా చేసింది. ఎస్‌ఐ పోస్టుకు 60-70 లక్షల దాకా వసూలు చేసి మాస్ కాపీయింగ్, బ్లూటూత్‌ల వినియోగం, అభ్యర్థుల మార్పు వంటి విషయం గత పరీక్షల్లో చోటు చేసుకున్న విషయం తెలిసిందే. వాటిని రద్దు చేసి కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఈనెల 23న పరీక్షలు జరిపేందుకు సిద్ధం కాగా నాలుగు రోజుల ముందే అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ పోస్టు వచ్చేలా చేస్తానంటూ స్టేట్ ఇంటెలిజెన్స్ ఎస్‌ఐ లింగయ్య అభ్యర్థులతో డీల్‌కు ప్రయత్నించారని అఖిల కర్ణాటక రాష్ట్ర విద్యార్థి సంఘం ప్రతినిధులు శుక్రవారం బెంగళూరు చంద్రా లే అవుట్ పోలీసులు ఫిర్యాదు చేశారు. కర్ణాటక పరీక్షా ప్రాధికార జరుపుతున్న 545 ఎస్‌ఐ పరీక్షల్లో ఉద్యోగాలు వచ్చేలా చేస్తానని, ఇంటెలిజెన్స్ ఎస్‌ఐ దందా చేస్తున్నారని వారు ఆరోపించారు. ఇప్పటికే పలువురు అభ్యర్థులతో 85 లక్షలకు ఒప్పందం చేసుకున్నారని, ముందస్తుగా రూ.5లక్షలు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రశ్న పత్రం లీకేజ్ ద్వారా సహాయం చేస్తామని హామీ ఇచ్చినట్టు వారు వివరించారు. అభ్యర్థులతో ఎస్‌ఐ జరిపిన వాట్సప్ సందేశాలు, స్క్రీన్‌షాట్లు, ఆడియో క్లిప్పింగ్‌లను పొందుపరిచారు. కాగా శనివారం జరిగిన కమర్షియల్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల ప్రశ్నాపత్రం లీకేజ్ అయిందనే వదంతులను కర్ణాటక పరీక్షా ప్రాధికార ఖండించింది.

ఆందోళన వద్దు : హోంశాఖ మంత్రి పరమేశ్వర్

ఎస్‌ఐ పరీక్షల అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రెండు రోజులుగా వస్తున్న అన్ని అంశాలపైనా సీసీబీ పోలీసులు సమగ్రంగా విచారణ జరుపుతారని హోంశాఖ మంత్రి పరమేశ్వర్ తెలిపారు. బెంగళూరులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్, కమర్షియల్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ నియామక పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రం లీక్ చేస్తామనే అంశంపై పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును సీరియస్‌గా భావిస్తున్నామని తెలిపారు.

తాగు నీటికి కటకట



- 6,097 గ్రామాల్లో తీవ్ర ఎద్దడి
- 2400 ప్రైవేటు బోర్ల యజమానులతో ఒప్పందం
- వచ్చే నెలలో టాస్క్‌ఫోర్స్ సమావేశాలు

బెంగళూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తీవ్రమైన వర్షాభావంతో రానున్న రోజుల్లో తాగునీటికి కటకటలాడే పరిస్థితులు దాపురించాయి. డిసెంబరు నాటికే ఉత్తర కర్ణాటకలోని పలు గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇదే విషయాన్ని బెళగావిలో జరిగిన శాసనసభ శీతాకాల సమావేశాల వేళ ప్రస్తావించారు. రానున్న రోజుల్లో ఈ పరిస్థితి మరింత జఠిలం కానుందనే ఆందోళన నెలకొంది. తాజాగా రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ జిల్లా అధికారులు, సబ్ డివిజనల్ అధికారులతో జరిపిన సమీక్షలో బెంబేలెత్తే అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఏకంగా 6,097 గ్రామాలు, 1186 వార్డుల్లో తాగునీటి సమస్య తలెత్తనుందని నివేదికలు తేల్చాయి. దీన్నిబట్టి ఉత్తర కర్ణాటక పరిధిలోని దాదాపు 8 జిల్లాలతో పాటు కోలారు, తుమకూరు, చిక్కబళ్లాపుర, చామరాజనగరతోపాటు మరిన్ని జిల్లాల్లో తాగునీటి సమస్య తీవ్రం కానుందనే సంకేతాలు అందాయి. ఇప్పటికే ప్రాంతాలవారీగా రెవెన్యూ అధికారులు ప్రైవేట్ బోర్లను అత్యవసరంగా వినియోగించుకునేలా ఒప్పందం చేసుకుంటున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ కాలంలో సంతృప్తికరంగా వర్షాలు లేకపోవడంతో పంటలసాగు జరగలేదు. బోరుబావుల కింద ఉద్యానవన పంటలసాగు చేస్తున్నారు. కూరగాయలు, ఆకుకూరలు వంటి సాగుకు బోరుబావులే శరణమయ్యాయి. ప్రస్తుతం ప్రాంతాలవారిగా అధికారులు బోరుబావులు స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమవుతుండగా రైతులు వెనుకంజ వేస్తున్నారు. ఇప్పటికే భూగర్భజలాలు అడుగంటడంతో బోరుబావుల్లో నీటిమట్టం గణనీయంగా తగ్గుతోంది. మార్చి నాటికి పరిస్థితి ఎలా ఉంటుందో అనే ఆందోళన కొనసాగుతోంది. అయినా 2400కు పైగా బోర్లను స్వాధీనం చేసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 36 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సమకూరుస్తుండగా 139 గ్రా మాల్లో బోరుబావుల ద్వారా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నారు. మరోవైపు పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 19 జిల్లాల్లో పశుగ్రాసం కొనుగోలుకు టెండర్లను ఆహ్వానించారు. ప్రాంతాలవారీగా పశుగ్రాసం సమకూర్చుకునేందుకు అనుకూలంగా రైతులకు 7 లక్షల కిట్ల విత్తనాలు అందించారు. ఫిబ్రవరిలో మరో విడతగా రూ.20 కోట్లతో విత్తన కిట్లను అందించడానికి సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లో గత ఏడాదితో పోలిస్తే భారీగా నీటి నిల్వలు కుశించుకుపోయాయి. మరోవైపు కావేరికి అనుబంధమైన ప్రాజెక్టుల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నా తమిళనాడుకు నీరు విడుదల చేయాల్సిందేననే కావేరి నీటి నిర్వహణా మండలి ఆదేశాలు సర్వత్రా ఆందోళనకు కారణమవుతోంది.



బళ్లారి జిల్లా హరిగినడోనీలో ట్యాంకర్ వద్ద నీటి కోసం ఎగబడుతున్న గ్రామస్థులు

వచ్చే నెలలో ఎమ్మెల్యేల అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ సమావేశాలు

ఫిబ్రవరి నెలలో అన్ని నియోజకవర్గాల్లో తాగునీరు, పశుగ్రాసం వంటి అత్యవసర అంశాలపై ఎమ్మెల్యేల అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ సమావేశాలను ఏర్పాటు చేయనున్నారు. ఫిబ్రవరిలో శాసనసభ సమావేశాలు కొనసాగనున్నాయి. రెండు వారాలపాటు జరిగే శాసనసభ సమావేశాలు జరగనున్నాయి. ఇదే సందర్భంలోనే ఎమ్మెల్యేల అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ సమావేశాల నివేదికలపై రెవెన్యూశాఖ సమీక్ష నిర్వహిస్తుంది. ప్రాంతాలవారిగా తాగునీరు, పశుగ్రాసం, ఉపాధి పనులపై ఎమ్మెల్యేల సూచనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోదలిచారు.

కార్యకర్తల విశ్వాసం పొందండి

- బీజేపీ రాష్ట్ర నేతలకు ప్రధాని పిలుపు

బెంగళూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ పార్టీ కార్యకర్తల విశ్వాసం పొందాలని ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్ర నాయకులకు సూచించారు. శుక్రవారం డిల్లీ నుంచి కలబురగి విమానాశ్రయానికి వచ్చిన సందర్భంలో కేంద్రమంత్రి శివకుమార్ ఉదాసి, ఎంపీ ఉమేశ్‌జాధవ్, ముఖ్యనాయకులతో కాసేపు ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని రాష్ట్రంలో ఎక్కువ స్థానాలు గెలుపొందాలంటే సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని సూచించినట్టు ఎంపీ ఉమేశ్‌జాధవ్ తెలిపారు. ప్రతి నియోజకవర్గంపైనా శ్రద్ధ చూపాలని, నిరంతరం ప్రజల మధ్యనే ఉండాలని సూచించారని తెలిపారు. స్వాగతం చెప్పేందుకు రాష్ట్రం నుంచి మంత్రి శరణ ప్రకాశ్‌పాటిల్‌ను పంపడంపై సీఎం సిద్దరామయ్యకు కృతజ్ఞతలు తెలపాలని సూచించారన్నారు. రాష్ట్రంలో సమిష్టిగా పనిచేస్తే తగిన ఫలితం ఉంటుందని ప్రధాని సూచించినట్టు ఎంపీ వివరించారు.

గాలి అక్రమాల కేసు బళ్లారికి బదిలీ చేయండి

బెంగళూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డికి సంబంధించిన గనుల అక్రమాల కేసును బళ్లారి కోర్టుకు బదిలీ చేయాలని పిటీషనర్ తపాలా గణేశ్ కోరారు. ఈ మేరకు ఆయన శనివారం కోర్టుకు సంబంధించిన విషయాలను మీడియాకు తెలిపారు. గంగావతి ఎమ్మెల్యేగా ఉన్న మేరకు అక్కడి మెజిస్ట్రేట్ కోర్టులో పిటీషన్ దాఖలు చేయగా న్యాయం జరగలేదన్నారు. గంగావతి మెజిస్ట్రేట్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసును బెంగళూరు ప్రజా ప్రతినిధుల కోర్టు ద్వారా బళ్లారికి బదిలీ చేసేలా కోరామన్నారు. ప్రజా ప్రతినిధులపై నమోదైన కేసులను రోజు విడిచి రోజు విచారణ జరపాలని వారానికోసారి చీఫ్ జస్టిస్‌కు నివేదిక ఇవ్వాలనే నిబంధన పాటించాలని కోరామన్నారు. 2012 నుంచి నమోదైన కేసులు వందలసార్లు వాయిదాలు పడ్డాయని తపాలా గణేశ్ వివరించారు.


రాష్ట్రానికి ఆర్థిక కమిషన్ మొండిచేయి

- నిధుల్లో భారీ కోత ● రామయ్య అప్లైడ్ సైన్స్ సదస్సులో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి 15వ ఆర్థిక కమిషన్ ద్వారా రావాల్సిన నిధుల్లో భారీగా కోత ఏర్పడిందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. రామయ్య యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్స్ ఆధ్వర్యంలో ఆర్థిక సమాఖ్య వ్యవస్థపై జాతీయ స్థాయి చర్చాగోష్ఠి జరిగింది. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన చర్చాగోష్ఠిలో 13వ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ విజయ్ ఖేల్కర్, 14వ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు ఎం. గోవిందరావు, మాజీ ఐఏఎస్ ఎంఆర్ శ్రీనివాసమూర్తి, రాష్ట్ర ప్రభుత్వ అదనపు చీఫ్ సెక్రటరీ ఎల్‌కే అతీక్ ముఖ్యులుగా పాల్గొన్నారు. రామయ్య అప్లైడ్ సైన్స్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ కేకే రైనా స్వాగతోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ దేశంలో అత్యధిక పన్నులు చెల్లించే రెండో అతిపెద్ద రాష్ట్రం కర్ణాటక అన్నారు. రాష్ట్రానికి ఆర్థిక కమిషన్ ద్వారా తలసరి ఆదాయానికి అనుగుణంగా గ్రాంట్లు రావడం లేదన్నారు. కొవిడ్ తర్వాత సమాజంలో మార్పులు వస్తున్నాయని, వాటికి అనుగుణంగా ఫైనాన్స్ కమిషన్ కేటాయింపులు పెరగాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో తలసరి ఆదాయంలో భారీ వ్యత్యాసం ఉందన్నారు. ఆర్థిక అంశాలపై విద్యాసంస్థల్లో చర్చాగోష్ఠులు జరగాలని పిలుపునిచ్చారు. రామయ్య అప్లైడ్ సైన్స్‌లో ఆర్థిక అంశాలు, ఫైనాన్స్ కమిషన్‌పై చర్చాగోష్ఠిని ప్రత్యేకంగా కొనియాడారు. ఆర్థిక వ్యవహారాల అంశాలు అన్ని వర్గాలకు అర్థం కావాలంటే చర్చలు కొనసాగాలన్నారు. విద్యాసంస్థలు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. స్థానిక సంస్థల బలోపేతానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 266, 243 లను సవరణలపైనా చర్చలు జరగాలన్నారు. ప్రొఫెసర్ ఎం. గోవిందరావు మాట్లాడుతూ కొవిడ్ తర్వాత 16వ ఫైనాన్స్ కమిషన్ ఏర్పడిందని, గతంలో ఎప్పుడూ లేని కొరత కనిపిస్తోందన్నారు. చర్చాగోష్ఠులలో రాష్ట్రాల ఆర్థిక స్వయం ప్రతిపత్తి, జీఎస్టీ అంశాలపై ప్రస్తావించారు. ముగింపు సమావేశంలో రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం సేకరించే సెస్, సర్‌చార్జ్‌లలో కర్ణాటక భాగస్వామ్యం కోరుతోందన్నారు. బెంగళూరు ఆదాయ నిష్పత్తిని పరిశీలించుకుని గ్రాంట్లు కేటాయించాలని, ప్రాంతీయ అసమానతలను పరిగణించాలన్నారు. ఎంఎస్ రామయ్య అప్లైడ్ సైన్స్ యూనివర్సిటీ ఉపకులపతి, గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సీఈఓ ఎంఆర్ శ్రీనివాసమూర్తి, గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సలహాదారుడు రక్షా రామయ్యతోపాటు సోషల్ సైన్స్ విభాగం డైరెక్టర్లు, ఆర్థికశాఖ కార్యదర్శులు, సీనియర్ అధికారులు, విద్యానిపుణులు, విద్యార్థులు భాగస్వామ్యులయ్యారు.



ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు జ్ఞాపిక అందజేత



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.89	1,619.59
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	000	9,288
సామర్థ్యం (టీఎంసీలు)	10.13	60.19

కమ్మవారి వైభవం జిల్లాధ్యక్షుడిగా వేలూరు శ్రీరామ్ చౌదరి



శ్రీరామ్‌చౌదరి(ఫైల్)

బళ్లారి సిటీ, జనవరి 20: కర్ణాటక రాష్ట్ర కమ్మవారి వైభవం బళ్లారి జిల్లా నూతన అధ్యక్షుడిగా వేలూరు శ్రీరాములును, జిల్లాప్రధాన కార్యదర్శిగా ఎస్.వెంకట్‌నాయుడును ఎంపికచేసినట్లు జాతీయ ప్రధానకార్యదర్శి ఎన్‌పీసురేశ్ చౌదరి శనివారం తెలిపారు. కమ్మవారి వైభవం జాతీయ కమిటీ ఆదేశాల మేరకు కర్ణాటక రాష్ట్ర అధ్యక్షులు నెక్కంటి రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి హరినాయుడు సూచన మేరకు బళ్లారి జిల్లా అధ్యక్షుడిని నియమించినట్లు తెలిపారు. ఈసందర్భంగా వేలూరు శ్రీరాములు మాట్లాడుతూ తమకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానన్నారు. తమ కమ్యూనిటీలో చేదోడువాదోడుగాఉంటూ ఆర్థికంగా తమవంతు సహకారాలు అందిస్తామన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల సదుపాయం



విజయవిఠల దేవస్థానం వద్ద సిద్ధంగావున్న ట్రైసైకిళ్లు

కంప్లి, జనవరి 20 : హంపి పుణ్యక్షేత్రంలోని విజయవిఠల దేవస్థానంలో అంగవికలాంగులను దృష్టిలో వుంచుకుని పురాతత్వశాఖ ట్రైసైకిళ్ల సదుపాయాన్ని కల్పించింది. గతంలో ఈ సదుపాయం లేక పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పురాతత్వ శాఖకు అంగవికలాంగులు తమ ఇబ్బందులను తెలియజేయడంతో వెంటనే స్పందించిన అధికారులు ఈ ట్రైసైకిళ్లను ఏర్పాటు చేశారు.

పేటే ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

సిరుగుప్ప, జనవరి 20: పేటే ఆంజనేయస్వామికి శనివారం ఘనంగా ప్రత్యేక పూజలు జరిగాయి. సిరుగుప్ప పట్టణంలో పురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందిన పేటే ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. అర్చకులు స్వాముల వారికి పుష్పాలంకార సేవలు, ఆకు పూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. ఈ నెల 25వ తేదీన అంబాజాతర మహోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఐదు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

రాజ్యాంగంపై అవగాహన జాతా



జాతా కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

హొసపేట,జనవరి 20: హొసపేట తాలూకాలో రాజ్యాంగ అవగాహనజాతాను విజయవంతం చేయాలని హొస్పేట తహసీల్దార్, తాలూకా స్థాయి అవగాహన కమిటీ చైర్మన్ విశ్వజిత్‌మెహత అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75ఏళ్లు కావస్తున్న నేపథ్యంలో రాజ్యాంగ అవగాహన జాతా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. జిల్లాలోని అన్ని తాలూకాలు, పంచాయితీల మీదుగా ఊరేగింపు నిర్వహించేందుకు కలెక్టర్ కమిటీని ఏర్పాటు చేశారన్నారు.

కరువుకాలానికి కాసులపంట

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలనిచ్చే ఆవాల సాగు

కంప్లి, జనవరి 20: ఈ సంవత్సరం వర్షాభావం కారణంగా తుంగభద్రజలాశయానికి అనుకున్న స్థాయిలో నీరు రాలేదు. దీంతో రబీకి నీరు వదలలేదు. మామూలుగా ప్రతి యేటా రబీ కింద వరి, మొక్కజొన్న, సజ్జ, ప్రొద్దుతిరుగుడు, ఇతర పంటలు వేసేవారు. కాని ఈ ఏడాది వర్షాభావం కారణంగా రైతులు నిరాశ పడకుండా కొత్త ఆలోచనచేశారు. కంప్లి నియోజకవర్గం పరిధిలోని నెల్లూడి, ఎమ్మిగనూరు, మన్నూరు, సూగూరు, ఇతర గ్రామాల్లో రబీలో ఆవాల పంటను ఆరుతడి కింద సాగు చేశారు. కొద్దిపాటి తేమ కూడా ఈ పంటకు సరిపోవడమే ఇందుకు కారణం. ఎకరాకు సుమారుగా మూడు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో ఆవాలు క్వింటాలు రూ. 5 వేల వరకు పలుకుతోంది. పంట విరగపండడంతో ఆవాల పంట వేసిన రైతులందరూ హర్షం వ్యక్త చేస్తున్నారు.

ఈ సందర్భంగా హిరేజాగనూరు గ్రామానికి చెందిన రైతు కుటుంబ రావు మాట్లాడుతూ నవంబరులోనే వరి పంట కోసిన అనంతరం ఆవాలను ఎకరాకు ఒక కిలో చొప్పున వెదజల్లానన్నారు. అనంతరం రెండు బస్తాల యూరియా వేశానని, చలి కాలంలోనే పంట ఏపుగా పెరుగుతున్నదన్నారు. జనవరి మాస చివరికల్లా పంట చేతికొస్తుందన్నారు.



కొట్టాల వద్ద విరగపండిన ఆవాల పంట. ఇన్‌సెట్‌లో రైతు కుటుంబరావు

నేడు కమ్మవారి విందు.. భారీ ఏర్పాట్లు

● 25వేల మందికి సదుపాయాలు ● తెలుగువారి క్యాంపుల నుంచి భారీగా జనసమీకరణ



కార్యక్రమానికి ఏర్పాటు చేసిన వేదిక



విందు ఏర్పాట్లలో నిమగ్నమైన సిబ్బంది

బళ్లారి, జనవరి(ఆంధ్రజ్యోతి): 20 చంద్రబాబు నాయుడు జైలు నుంచి బెయిల్‌పై విడుదలై ప్రచారంలో పాల్గొంటున్న నేపథ్యంలో బళ్ళారికి చెందిన ఆయన అభిమానులు, కమ్మసామాజిక వర్గంవారు ఆదివారం భారీ ఎత్తున విందును ఏర్పాటు చేశారు. బళ్లారి ఎయిర్‌పోర్టు సమీపంలోని ధర్మారెడ్డి ఫంక్షన్ హాల్‌వద్ద జరిగే ఈ కార్యక్రమానికి బళ్లారి జిల్లాతో పాటు సిరుగుప్ప, సింధనూరు, గంగావతి, మాన్వి, బెంగళూరు, గాంధీనగర్, బళ్ళారి జిల్లా పరిధిలోని అనేక క్యాంపుల నుంచి చంద్రబాబు అభిమానులు, ఆయన సామాజికవర్గ ప్రజలు భారీగా హాజరు కానున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఇందుకుగాను భారీ వేదికను సిద్ధం చేశారు. విందు భోజనంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. ముఖ్యంగా గతంలో చంద్రబాబునాయుడు అరెస్టు నేపథ్యంలో కర్ణాటకలోని ఈ ప్రాంతం నుంచి అనేకమంది ధర్నాలు, ఉద్యమాలు చేశారు. నారా లోకేష్ చేసిన యువగళానికి కూడా మద్దతు పలికారు. ఈ నేపథ్యంలోనే బళ్లారి కమ్మసమాజానికి చెందిన ప్రముఖులు ఈ విందు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం.

దిగుబడి తగ్గినా పెరగని మిరప ధర

● డీలా పడిన కల్యాణ కర్ణాటక రైతులు

బళ్లారి సిటీ, జనవరి 20: ఈ ఏడాది రబీసీజన్‌లో సరైన వర్షాలులేక జలాశయాలు వెలవెలబోతుండగా, గ్రామీణ ప్రాంతాల్లో పంటలు లేక రైతుల ముఖాల్లో కళ లోపించింది. కల్యాణ కర్ణాటక జిల్లాల్లో కరువు ఏర్పడింది. ఆ జిల్లాల్లో కృష్ణా, తుంగభద్ర, భీమా నదులున్నా నారాయణపుర కుడి కాలువ, తుంగభద్ర కాలువల నుంచి నీరు అందక మిరప పంట అనుకున్న మేరకు దిగుబడి రాలేదు. ఆయకట్టుకిందవేసిన పంటలకు పూర్తి స్థాయిలో నీరు అందక పోవడంతో రైతులు ట్యాంకర్‌ల ద్వారా నీరు పోసి పంటను కాపాడుకున్నారు. గతంలో మిర్చి పంట ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు వచ్చేది. ఈసారి 3క్వింటాళ్లకు పరిమితమైందని రైతులు వాపోతున్నారు. గత ఏడాది బ్యాడిగి రకం మిరపకాయల క్వింటాలు ధర రూ.65వేలు ఉండగా, నేడు అది రూ. 40వేలు పలుకుతోంది. గుంటూరు మిరపకాయలు క్వింటాల్ గతంలో రూ.22వేలు ఉండగా ఈ ఏడాది ధర 15వేలకు పతనమయింది. జిల్లాలో ఇంకా రూ. 400 కోట్లు విలువ చేసే మిరప పంటకు నీరు లేక ఎండిపోయే దశలో ఉంది.



నీరు లేక ఎండుతున్న మిరప పంట

ఫిబ్రవరి నెలాఖరు వరకు 6టీఎంసీల నీరు కాలువకు వదిలేందుకు మంత్రులు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు అంటున్నారు.

పక్షుల విహారకేంద్రం హరపనహళ్ళి

బళ్లారి సిటీ, జనవరి 20: సూర్యాస్తమయం సమయంలో గుంపులు గుంపులుగా తమ గూళ్లకు తిరిగి వచ్చే హమ్మింగ్‌బర్డ్స్ శబ్దంతో విజయనగరం జిల్లా హరపనహళ్ళి పట్టణం ఇప్పుడు పక్షుల జాతరను తలపిస్తోంది. హరపనహళ్ళి సరస్సు విస్తీర్ణంలో మూడు వంతులు ముళ్ల మొక్కలతో నిండిఉంది. గతేడాది మంచి వర్షాలు కురవడంతో సరస్సు నిండి తేమశాతం పెరగడంతో ఎండిపోయిన ముళ్లచెట్లు ప్రస్తుతం వివిధ రకాల దేశ, విదేశీ పక్షులకు ఆశ్రయం కల్పిస్తున్నాయి. ఉదయం సాయంత్రం వేళల్లో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు సరస్సు ఒడ్డున కాసేపు విశ్రాంతి తీసుకుంటూ పక్షుల కిలకిలా రావాలు వింటూ గుంపులు గుంపులు ఎగురుతున్న పక్షులను చూసి ఆనందిస్తారు. వీటిలో దేశీ జాతి కొంగ, నల్లకొంగ, గ్రేట్ ఎగ్రెట్‌కొంగ, గిజాగ్, కృష్ణవాహన పక్షి,చిటగుబ్బి, గుణమనక, గూస్‌బాతు, వాటర్ పౌల్, వాటర్‌కాకి, మైనా, కింగ్‌ఫిషర్, డేగపక్షులను నందిబేవూరు అరసికెర, కంచిచెరువుతో సహా అనేక ప్రదేశాలలో చూడవచ్చు. మాంగోలియాకు చెందిన బార్ హెడ్డ్ గూస్, పెయింటెడ్ స్టోర్క్(దాసగొంగ), ఉత్తర యూరప్‌కు చెందిన సాండ్‌పీప్, లిటిల్ కార్మోరెంట్, నైజీరియాకు చెందిన బ్లాక్ టేలర్, గాడ్‌విట్ పక్షులు హరపనహళ్ళి యల్లాపూర్ సరస్సులో కనిపిస్తాయి. తూర్పు యూరప్, మధ్య ఆసియానుండి గులాబీ మైనా, కుంకుమపువ్వుమైనా ఆగస్టులో వచ్చి ఏప్రిల్‌లో వెళ్ళిపోతాయని పర్యావరణవేత్త చంద్రప్ప చెప్పారు. చలికాలం కోసం వచ్చే విదేశీ పక్షులు గుడ్లుపెట్టి పిల్లలను పొదిగి వెళ్ళిపోయే సమయం ఆసన్నమైందన్నారు.



హరపనహళ్ళి సరస్సు వద్ద విదేశీ విహంగాలు

నేడు న్యాయమూర్తుల శిక్షణ శిబిరం

బళ్లారి సిటీ, జనవరి 20: కర్ణాటక న్యాయసేవల ప్రాధికార సంస్థ , బెంగళూరు మధ్యవర్తిత్వ కేంద్రం, జిల్లాన్యాయసేవల ప్రాధికార సంస్థ సంయుక్తంగా ఆదివారం ఉదయం స్థానిక తాళూరు రోడ్డులోని కొత్తకోర్టులో బళ్లారి, కొప్పళ, రాయచూరు జిల్లాల న్యాయమూర్తులకు శిక్షణశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒకప్రకటనలో తెలిపారు. శిబిరాన్ని జిల్లాప్రధాన న్యాయమూర్తి పుష్పాంజలి దేవి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. న్యాయమూర్తులు మారుతి బగాడె, చంద్రశేఖర్, బెంగళూరు మధ్యవర్తిత్వ శిక్షణ కేంద్రం అధికారులు సుదా, వైశాలి, న్యాయవాది త్రివేణి పత్తార్ హాజరవుతారని పేర్కొన్నారు.

ఆధార్ సేవలను అప్‌డేట్ చేస్తాం



పోస్టల్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

సిరుగుప్ప, జనవరి 20 : ఆధార్ కార్డు సమస్యలు వుంటే వాటిని సరిచేసుకోవడానికి అప్‌డేట్ చేస్తామని హెడ్ పోస్టుమాస్టర్ మంజునాథశెట్టి తెలిపారు. శనివారం సిరుగుప్ప పట్టణంలో హెడ్ పోస్టుఆఫీసులో అందిస్తున్న సేవలపై సర్వసభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో హెడ్ పోస్టుమాస్టర్ మంజునాథశెట్టి మాట్లాడుతూ ఆధార్‌కార్డులో ఫోన్ నెంబర్లు, పేర్లు, అడ్రస్ సరిగా లేకపోతే వాటిని సరిచేసుకోవడానికి ఆస్కాముంటుందని ఆయన తెలిపారు. సరియైన దాఖలాలు చెల్లించి తప్పులను సరిచేసుకోవాలని ఆయన తెలిపారు. వాటితో పాటు పింఛన్ ఖాతాలు నమోదు చేస్తామన్నారు. ఈ సందర్భంగా పోస్టల్ సిబ్బంది రాఘవేంద్ర, భీమప్ప, సమాజసేవకులు అబ్దుల్ నబీ, మహమ్మద్ నౌషద్ పాల్గొన్నారు.

త్వరగా గిడ్డంగి పనులను పూర్తి చేయాలి : ఎమ్మెల్యే

కంప్లి, జనవరి 20 : కంప్లి నుండి జానూరుకు వెళ్లు రోడ్డు మార్గంలో ధాన్యం నిల్వ చేసే గిడ్డంగి పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. బుధవారం ఆయన గిడ్డంగులను పరిశీలించారు. అక్కడ నాలుగు గిడ్డంగుల నిర్మాణం మంజూరు కాగా కేవలం రెండు మాత్రమే పూర్తయ్యాయి. రెండు గిడ్డంగుల పనులు మధ్యలోనే ఆగుతూ సాగుతూ వుండటంతో వాటిని పరిశీలించారు. నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తిచేయాలని గిడ్డంగుల శాఖ అధికారి సుష్మిత్‌కు సూచించారు. రైతులకు అనుకూలం కావడంతో పాటు స్త్రీశక్తి మహిళలకు కుట్టు మిషన్లు, ఇతర శిక్షణకు కూడా ఇవి ఉపయోగపడతాయన్నారు. ఆ శాఖ అధికారులతో చర్చించి వెంటనే పనులను పూర్తి చేసి గిడ్డంగులను రైతులకు, ఇతరులకు అనుగుణంగా సిద్ధం చేయాలని తెలిపారు.

రాజ్యాంగ ఉద్దేశాలను అమలుచేస్తేనే అభివృద్ధి



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ ఇస్మాయిల్

బళ్లారి సిటీ, జనవరి 20: భారత పౌరులమైన మనం రాజ్యాంగ ఉద్దేశాలను పూర్తిగా అమలుచేస్తేనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి. నాగరాజు అన్నారు. కన్నడ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బళ్లారి తాలూకా మోకాలోని ప్రభుత్వ ప్రథమశ్రేణి కళాశాల హాల్లో శనివారం ఏర్పాటుచేసిన డా. అంబేద్కర్ పఠన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు, పోషకాహార లోపంతో సహా బాలికలపై వివిధ రకాల వివక్షలు ప్రబలంగా ఉన్నాయన్నారు. దీనిని తొలగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. నేటి యువతరం చదువుతో పాటు క్రీడలు, కళలు, సంగీతం, సాహిత్యం ఇతర నైపుణ్యాలపై ఆసక్తి కలిగి ఉండాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో పాల్గొన్న కళాశాల విద్యార్థులకు సరిఫికేట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అధ్యాపకులు డాక్టర్ తిప్పేస్వామి, మోకా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ మకందర్, ప్రొఫెసర్ కళావతి, అసోసియేట్ ప్రొఫెసర్స్ పాల్గొన్నారు.

మురుగునీటి కుంటను శుభ్రం చేయండి



ఏళుబెంచిలో ఏర్పడిన మురుగునీటి గుంట

కంప్లి, జనవరి 20 : ఏళుబెంచి గ్రామం నుంచి ఆదాపురంకు వెళ్లే రోడ్డు పక్కన మురుగునీటి కుంటను శుభ్రం చేయాలని గ్రామస్తులు తమ్మన్నగౌడ కోరారు. దీనివల్ల రోగులు డెంగ్యూ, మలేరియా వంటి రోగాలకు గురవుతూ ఆస్పత్రి పాలవుతున్నార న్నారు. ఎన్నోసార్లు గ్రామ పంచాయతీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ మురికి కుంట వల్ల గ్రామంలో విషజ్వరాలు సోకే అవకాశం వుందన్నారు. ఇప్పటికే గ్రామంలో వున్న మురుగునీరంతా ఈ మురికి కుంటకు చేరుతుండటంతో దుర్వాసన వస్తోందన్నారు. కావున వెంటనే ఈ మురికి గుంటను శుభ్రం చేసి ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

హోసూరు జోన్

తగ్గిన కాలీఫ్లవర్ ధర.. రైతుల ఆవేదన



గిట్టుబాటు ధర రాక పశువుల మేతకు వదిలేసిన కాలీఫ్లవర్ పంట

హోసూరు జనవరి 20 : హోసూరు, శూలగిరి, డెంకణీకోట ప్రాంతంల్లోని రెండు వేల ఎకరాల్లో కాలీఫ్లవర్ సాగవుతోంది. గత కొద్ది రోజులుగా నల్లమచ్చ వ్యాధి కారణంగా నాణ్యత తగ్గిపోవడంతో గిట్టుబాటు ధర రాక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. నేలల్లో పోషకాలు లేకపోవడంతో పువ్వు రంగుమారిపోయింది, అందువలన ధర చాలా తక్కువ పలుకుతోంది. ఎకరా సాగుకు రూ.50 వేలకు పైగా ఖర్చువుతుంది. కాని పూలు అమ్మితే వచ్చిన డబ్బు కూలీలకు కూడా సరిపోకపోవడంతో కంపోస్టు తయారీకి చెత్తలో పడేస్తున్నారు. కొందరు రైతులు కోయకుండానే పంటను పొలంలోనే వదిలేస్తున్నారు. హోసూరు సమీపంలోని ఎర్రకొండపాళ్యం ప్రాంతంలో ఓ రైతు పంటను పశువుల మేతకు వదిలేశాడు. ఈ పరిస్థితుల్లో కొందరు రైతులు పంటను కంపోస్టు తయారు చేసేందుకు డెంకణీకోట రహదారిపై వేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఈ కాలీఫ్లవర్ పూలకు చాలా డిమాండ్ ఉండేది, ఇప్పుడు పోషకాలు లోపించడంతో పూల నాణ్యత తగ్గి ధర దారుణంగా పడిపోయింది.

ఏరోనాటికల్ డివిజన్ బోర్డు చైర్మన్‌గా అరువుడైనంబి

హోసూరు, జనవరి 20: హోసూరు అదియమాన్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ అరువుడైనంబి కోల్‌కత్తా ఏరోనాటికల్ డివిజన్ బోర్డు చైర్మెన్‌గా నియమితులయ్యారు. జనవరి 1 నుంచి ఆయన నియామకం అమల్లోకి వచ్చింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా)సహా వివిధ ప్రొఫెషనల్ సొసైటీలలో కూడా ఆయన పనిచేశారు. డివిజన్ బోర్డు సభ్యుడు చైర్మన్, ఐఈఐ హోసూరు లోకల్ సెంటర్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడుగా, ఏరోస్పేస్ డివిజన్ చైర్మన్, స్టూడెంట్ కమిటీ, ఐఈఐ తమిళనాడు స్టేట్ సెంటర్‌తో సహా వివిధ హోదాల్లో పనిచేశారు. ఆయన ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, న్యూఢిల్లీలో కూడా జాతీయ కార్యవర్గ సభ్యుడిగా సేవలందించారు. 20 కంటే ఎక్కువ జాతీయ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ద్విచక్ర వాహనం చోరీ

హోసూరు(క్రైం) జనవరి 20 : హోసూరు సబ్ కలెక్టర్ కార్యాలయం సమీపంలోని హోసూరు లక్ష్మీదేవి నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న లోకేశ్ ఫోటో స్టూడియో నడుపుతున్నాడు. నిత్యం రాత్రి పూట ఇంటి ముందు బైక్ పార్క్ చేస్తుంటాడు. అదే విధంగా శుక్రవారం రాత్రి యథావిధిగా ఇంటికి వెళ్లి ఇంటి ముందు బైక్ నిలిపాడు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఆ ప్రాంతంలో ద్విచక్రవాహనంపై వీధిలో తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులు లోకేశ్ పార్క్ చేసిన ద్విచక్రవాహనం తాళం పగులగొట్టి వాహనాన్ని అపహరించారు, ఈ దృశ్యాలు అక్కడి సీసీ కెమరాల్లో రికార్డయ్యాయి. ఆ ప్రాంతంలో నివసించేవారు కొన్నేళ్లుగా తమ వాహనాలను క్రమం తప్పకుండా తమ ఇళ్ల ముందరే పార్కింగ్ చేస్తున్నారు. అయితే ఇదే మొదటి చోరీగా చెబుతున్నారు. సీసీటీవి ఫుటేజీ సాయంతో చోరీ ఘటనపై లోకేశ్ హోసూరు హడ్కో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

సీసీ కెమెరాల్లో రికార్డు అయిన బైక్ చోరీ దృశ్యం



పరిహారంపై పట్టింపులేని బీజేపీ ఎంపీలు

●కేంద్రంపై ఒత్తిడి తేవడంలో విఫలం ●రైతు సంఘం నాయకుడు చామరస మాలిపాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు చామరస మాలిపాటిల్

రాయచూరు జనవరి 20 : రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను నివారించడంలోను, రైతులకు పరిహారం అందించడంలోను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం గర్హనీయమని కర్ణాటక రైతు సంఘం హసిరు సేనల గౌరవాధ్యక్షుడు చామరస మాలిపాటిల్ అన్నారు. పరిహారం నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవడంలో బీజేపీ ఎంపీలు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల నాయకులతో కలిసి శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి రావాల్సిన రూ.40 వేలకోట్ల జీఎస్టీ నిధుల విడుదలలోను కేంద్రం వివక్ష చూపుతుండడం సరికాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న రాజకీయ విద్వేషాలు ప్రజలకు ముఖ్యంగా రైతులకు శాపంగా మారరాదని వ్యాఖ్యానించారు. గడచిన 9 ఏళ్లలో 18 లక్షల కోట్లకు పైగా కార్పొరేట్ రుణాలను మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం రైతు రుణాలను మాఫీ చేయడంలో నిర్లక్ష్యం వహించడం గర్హనీయమన్నారు. అనంతరం సమావేశంలో రాఘవేంద్ర కుష్టగి కూడా ప్రసంగించారు.


కార్యకర్తల బలమే పార్టీకి శ్రీరామ రక్ష : శివరాజ్‌పాటిల్

రాయచూరు జనవరి 20 : నిబద్ధతగల కార్యకర్తలు, ప్రజాబలమున్న నాయకులే భారతీయ జనతా పార్టీకి శ్రీరామరక్షని ఆ పార్టీ సిటీ ఎమ్మెల్యే, బీజేపీ జిల్లాధ్యక్షుడు డాక్టర్ శివరాజ్‌పాటిల్ అన్నారు. పార్టీ జిల్లాధ్యక్షుడిగా నియమితుడైన ఆయన శనివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగరవేసిన శివరాజ్ పాటిల్ కార్యకర్తలు తనకు శక్తిగా ఉంటే తాను వారిలో మరింత శక్తిని నింపుతానన్నారు. గడచిన మూడు దఫాలుగా తాను ఎమ్మెల్యేగా పనిచేసింది ప్రజల సేవ కోసమేనన్నారు. పదవులపై మమకారంతో రాజకీయాలు చేయలేదని పార్టీ నాయకత్వం ఇచ్చిన బాధ్యతలను నిర్వర్తించడమే తన బాధ్యతగా పని చేస్తానన్నారు. అన్ని తాలూకాల్లో పార్టీని మరింత బలోపేతంచేసి లోకసభ ఎన్నికల్లో అభ్యర్థులగెలుపే లక్ష్యంగా పనిచేద్దామన్నారు. కార్యకర్తలు బీజేపీ బలాన్ని మరోసారి చాటాలని కోరారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కౌంయ్...

గోపానంద నాథులు (జయంతి)



నందవరీక మహాయోగి గోపానందనాథులు 1907 జనవరి 21న తిరుపతిలో జన్మించారు. వేదాలపై అపార జ్ఞానం కలిగినవారు. శ్రీదేవీ ఆరాధనతో మోక్షమార్గ సాధనపై పరిశోధనలు చేశారు. అమ్మ వారి అనుగ్రహం పొందేందుకు సప్తశతీ మార్గంగా సూచించారు. మంత్రవిభాగం నుంచి 921 పూర్ణమంత్రాలను సూత్రీకరించారు. దేవీ మహాత్మ్యం రచన ఎంతో పేరొందింది. సనాతన ధర్మానికి పలు మార్గదర్శకాలు చేశారు. పలు ఆధ్యాత్మిక రచనలు చేశారు. 2003 డిసెంబరు 21న పరమపదించారు.

జి. అరవిందన్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత గోవిందన్ అరవిందన్ 1935 జనవరి 21న కేరళ రాష్ట్రం కొట్టాయంలో జన్మించారు. సినీ దర్శకుడు, స్క్రీన్ రైటర్, సంగీత దర్శకుడు, కార్టూనిస్ట్, చిత్రకారుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. మళయాళ సినీరంగంలో ఎంతో పేరొందారు. సినీరంగంలోకి ప్రవేశించకముందు మాతృభూమిలో కార్టూనిస్ట్‌గా పనిచేశారు. డాక్యుమెంటరీలు, నాటకాలు రూపొందించడంతోపాటు ఇతరుల సినిమాలకు సంగీతదర్శకత్వం వహించారు. కేరళ రాష్ట్ర అవార్డులతోపాటు జాతీయ పురస్కారాలు పొందారు. 1991 మార్చి 15న కన్నుమూశారు.

సంజయ్ సుబ్రమణ్యన్ (పుట్టినరోజు)



సంజయ్ సుబ్రమణ్యన్ 1968 జనవరి 21న చెన్నైలో జన్మించారు. కర్ణాటక సంగీతంలో పేరొందారు. వర్ధమాన గాయకులను ప్రోత్సహించేలా యూత్ అసోసియేషన్ ఆఫ్ కర్ణాటిక్ మ్యూజిక్ (వైఏసీఎం)ను స్థాపించారు. తమిళనాడు మ్యూజిక్ ఫెస్టివల్‌లో ప్రముఖ కళాకారుడిగా ఉన్నారు. సంగీత కళానిధి, ఇసై పెరారిగ్నర్ అవార్డు, గాన పద్మం, గ్లోబల్ ఇండియన్ మ్యూజిక్ అకాడమీ అవార్డు వంటివి అందుకున్నారు.

గౌరవ్ సోలంకి (పుట్టినరోజు)



గౌరవ్ సోలంకి 1997 జనవరి 21న హర్యానా రాష్ట్రం ఫరీదాబాద్ జిల్లా బల్లభ్‌ఘర్ ప్రాంతంలో జన్మించారు. 52కిలోల విభాగంలో బాక్సింగ్‌లో సత్తా చాటుకున్నారు. 2018 క్వీన్స్ ల్యాండ్ కామన్వెల్త్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించిన తొలి భారతీయుడు. అమెచ్యూర్ బాక్సింగ్ విభాగంలోనూ రాణించారు. అతడి సోదరుడు సౌరవ్ స్థానిక బాక్సింగ్ అకాడమీలో ట్రైనర్‌గా వ్యవహరిస్తుండగా, సోదరి నీలం జాతీయ స్థాయిలో బాక్సింగ్ ఛాంపియన్‌గా రాణించారు.

పిల్లలను బాగా చదివించండి

పావగడ ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ, జనవరి 20: తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తి కంటే ముఖ్యంగా నాణ్యమైన విద్య అందించాలని పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆయన శనివారం విరుపసముద్రం, దొమ్మతిమర్రి గ్రామ పంచాయతీలలో నిర్వహించిన జన సంపర్క సభలో ఆయన జ్యోతి వెలిగించి మాట్లాడారు. పావగడ తాలూకా వ్యాప్తంగా విద్య, ఆరోగ్య పరంగా తాము ఎంతో చేయూతనందించామన్నారు. దొమ్మతి మర్రి గ్రామంలో హైటెక్ బస్సు షెల్టర్‌తోపాటు ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజల సమస్యలపై పీడీఓలు, రెవెన్యూ అధికారులు సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరద రాజు, ఈఓ జానకిరామ్, కాంగ్రెస్ రూరల్ బ్లాక్ అధ్యక్షుడు రామాంజనప్ప, ఆది నారాయణ, మహిళా అధ్యక్షురాలు ఉషారాణి, సీఐ సురేష్, ఎస్ఐ విజయ్‌కుమార్, సీడీపీఓ సునీత, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై తేనెటీగల దాడి

హిందూపురం, జనవరి 20 : మండలంలోని చిన్నగుడ్డంపల్లి సమీపంలో శనివారం పొలాలవద్ద ఆడుకోవడానికి వెళ్లిన విద్యార్థులపై తేనెటీగలు దాడిచేశాయి. హిందూపురం మండలం చిన్నగుడ్డంపల్లికి చెందిన ఏడో తరగతి చదువుతున్న గోపి, ప్రవీణ్, ఆరో తరగతి చదువుతున్న చరణ్ పొలంవద్ద ఆడుకోవడానికి వెళ్లారు. ఈ సమయంలో తేనెటీగలు దాడిచేశాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వారిని వెంటనే హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో చరణ్ అనే విద్యార్థిని చిన్నగుడ్డంపల్లికి చెందిన గిరీష్ అనే యువకుడు ద్విచక్ర వాహనంలో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తుండగా కొట్నూరు కట్టపై లారీ ఢీకొంది. ఈ ఘటనలో గిరీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఇదే సందర్భంలో లారీ వెనుకు వస్తున్న కారు లారీని ఢీకొనడంతో ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. గాయపడ్డ గిరీష్‌ను, చరణ్‌ను ప్రభుత్వా సుపత్రికి తరలించారు. తేనెటీగలు దాడిచేసిన విద్యార్థులకు ఆసుపత్రిలో చికిత్సలందిస్తున్నారు. కట్టపై జరిగిన ప్రమాదం పై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అయోధ్య రాముడి సంబరాలు

పెనుకొండ రూరల్, జనవరి 20: అయోధ్య రామాలయంలో ఈనెల 22న బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని మండలంలోని భక్తులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. మండలం లోని కోనాపురం ఆంజనేయ స్వామి దేవాలయంలో వేద పండితులు విశ్వనాథ్ ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు చేశారు. అనంతరం శ్రీరాముడి చిత్రపటాన్ని ప్రత్యేక పూలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఇంటింటికి అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'నవోదయ'కు 4871 మంది విద్యార్థులు హాజరు

అనంతపురం విద్య, జనవరి 20: నవోదయ విద్యాలయ పరీక్షలకు 4,871 మంది విద్యార్థులు హాజరయ్యారు. శనివారం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 34 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8,857 మంది విద్యార్థులు హాజరుకావాల్సిఉండగా 4,871 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఏసీ గోవింద్ నాయక్, డిప్యూటీ డీఈఓ శ్రీనివాస్ రావు తనిఖీ చేశారు.

రాష్ట్రంలో ఎన్డీయే కూటమికి నేతృత్వం వహించండి

» కుమారస్వామికి కేంద్రమంత్రి అమిత్‌షా ఆహ్వానం

బెంగళూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి నేతృతం వహించాలని జేడీఎస్ పార్టీ కీలకనేత కుమారస్వామి కేంద్రహోంమంత్రి అమిత్‌షా ఆహ్వానించినట్లు సమాచారం. బీజేపీ - జేడీఎస్ పార్టీలు లోక్‌సభ ఎన్నికలలో కలిసి పోటీ చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఎన్‌డీఏ కూటమిలో జేడీఎస్ చేరిన మేరకు రెండురోజుల కిందట కుమారస్వామి ఢిల్లీలో బీజేపీ అధ్యక్షులు జేపీనడ్డా, కేంద్రహోంమంత్రి అమిత్‌షాలతో చర్చలు జరిపారు. ఇదే సందర్భంలోనే సీట్ల సర్దుబాటు అంశాన్ని అయోధ్యలో రామమందిరం ఆరంభం తర్వాత నిర్ణయం తీసుకుందామని తీర్మానించారు. జేడీఎస్ గెలుపు సాధించే మూడు సీట్లలో ఒకచోట పోటీ చేయాలని, లేనిపక్షంలో వెంటనే రాజ్యసభ కోటా ద్వారా కేంద్రంలో మంత్రి పదవిని కేటాయిస్తామని అమిత్‌షా సూచించినట్లు సమాచారం. దీనికి తోడు రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమికి నేతృత్వం వహించాలని కూడా సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల వేళ సమన్వయం పాటించేందుకు కీలకంగా వ్యవహరించాలని సూచించినట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతానికి కేంద్రంలో మంత్రి పదవి వద్దని లోక్‌సభ ఎన్నికలలో ఎక్కువ సీట్లు గెలుపు సాధించేదిశగా కలిసి పనిచేద్దామని కుమారస్వామి వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీనిని బట్టి జేడీఎస్‌కు మూడు స్థానాలు పొత్తులో భాగంగా దక్కనున్నాయనేది స్పష్టమవుతోంది. హాసన్, మండ్యతో పాటు చిక్కబళ్లాపుర లేదా తుమకూరు సీట్లు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. అయితే హాసన్‌లో ప్రజ్వల్ రేవణ్ణ మరోసారి గెలుపు కష్టమనే సంకేతాలు ఉండటంతో ఇదే స్థానం నుంచి జయదేవ కార్డియాలజీ డైరెక్టర్ మంజునాథ్‌ను రంగంలోకి దించాలనే ప్రయత్నాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. పద్మశ్రీ గ్రహీత డాక్టర్ మంజునాథ్ జేడీఎస్ జాతీయ అధ్యక్షులు దేవేగౌడకు స్వయాన అల్లుడు కావడంతో రంగంలోకి దించనున్నట్లు ప్రచారం సాగుతోంది. కానీ డాక్టర్ మంజునాథ్ రాజకీయాలకు వస్తారా అనేది ఇంకా ఖరారు కాలేదు. మొత్తమ్మీద రాష్ట్రంలో ఎన్డీయే కూటమికి కుమారస్వామి నేతృత్వం వహించనున్నారనేది రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోండి

» చిత్రావతి టెంపో యజమానులు, డ్రైవర్ల క్షేమాభివృద్ధి సంఘం

బాగేపల్లి, జనవరి 20: తాలూకాలోని చిత్రావతి టెంపో యజమానులు, డ్రైవర్ల క్షేమాభివృద్ధి సంఘానికి చెందిన 1.30 కోట్ల రూపాయలను సంఘం కార్యదర్శి అంజనేయరెడ్డి దుర్వినియోగం చేశారని అధ్యక్షుడు సయ్యద్ కలీముల్లా ఆరోపించారు. పట్టణంలో ప్రెస్‌క్లబ్‌లో ఆయన సంఘం పదాధికారులతో కలసి మీడియాతో మాట్లాడుతూ సంఘం సభ్యుల సంక్షేమం కోసం 200మందికిపైగా సభ్యుల మొత్తాన్ని చీటీల రూపంలో పొదుపు చేశామన్నారు. అయితే సంఘానికి రెండేళ్లుగా అధ్యక్షుడిగా ఉన్న తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకనే బైలా పాటించకుండా సభ్యులకోసం కేటాయించిన రూ.1.30 కోట్లను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఈ మొత్తాన్ని బ్యాంకు ఖాతాకు జమ చేయకుండా, సభ్యుల దృష్టికి తేకుండా ఖర్చు చేశారన్నారు. ఆడిట్ వేళ విషయం వెలుగు చూసిందని, దీనిపై ప్రశ్నించగా తనపైనే దాడికి సిద్ధమయ్యాడన్నారు. ఘటనపై తనిఖీ చేసి సభ్యుల మొత్తాన్ని సంఘం ఖాతాకు జమ అయ్యేలా చూడాలని కోరారు. మీడియా సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు సోమశేఖర్, సభ్యులు ఆనందరామయ్య శెట్టి, డీవీ బాబు, బాబాజాన్, ఏకే శివప్ప, రామచంద్రప్ప, శివ, ఆసిఫుల్లా, ఎన్ ఆంజనప్ప తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో చిత్రావతి టెంపో యజమానులు, డ్రైవర్ల క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు కలీముల్లా తదితరులు

ట్రాన్స్‌జెండర్లకు ఫోర్టిస్‌లో ఉచిత వైద్య పరీక్షలు

బెంగళూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బన్నేరుఘట్టరోడ్డులోని ఫోర్టిస్ ఆసుపత్రిలో ట్రాన్స్‌జెండర్‌లకు ప్రత్యేక వైద్య పరీక్షలు జరిపారు. నాగశెట్టిహళ్ళిలోని పీర్ అవాం సమర సొసైటీలో విద్యా సంస్థ సహకారంతో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫోర్టిస్ డాక్టర్లు పలు ఆరోగ్య సలహాలు ఇచ్చారు. ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు పాటించాలని మాదక ద్రవ్యాలకు ఇతరత్రా చెడు అలవాట్లకు బానిసలు కారాదని సూచించారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మీ సొంత నిర్ణయంపై ఉంటుందని సూచించారు. సాధారణంగా కుటుంబీకులకు ఇతరుల సహాయ సహకారాలు ఉంటాయని, మీలో కొందరు ఒంటరిగా నివసిస్తుంటారని వారు ఎప్పటికప్పుడు ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. కన్నడ బిగ్‌బాస్ కంటెస్టెంట్ నీతూ వనజాక్షితోపాటు పలువురు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రముఖులు

ఆలయాల స్వచ్ఛతకు పిలుపు



సన్నాహకసభలో మాజీ మంత్రి సుధాకర్ తదితరులు

శిడ్లఘట్ట, జనవరి 20: అయోధ్యలో శ్రీరామమందిర ప్రారంభోత్సవం నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఆలయ ప్రాంగణాలలో స్వచ్ఛతకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారని ఈ మేరకు తాలూకాలో కూడా చేపడుతున్నట్టు మాజీ మంత్రి డాక్టర్ కే సుధాకర్ పేర్కొన్నారు. తాలూకాలోని కోటె సర్కిల్‌లోగల శ్రీరామ దేవాలయంలో స్వచ్ఛతా పనులపై సన్నాహక సభను నిర్వహించారు. 22న బాలరాముడి ప్రతిష్ఠాపన జరగనుందని ప్రతి ఒక్కరూ పండుగల ఆచరించాలన్నారు. గాంధీజీ కలలుగన్నట్టు మళ్లీ రామరాజ్యం రానుందన్నారు. బీజేపీ నాయకుడు సీకల్ రామచంద్రేగౌడ మాట్లాడుతూ ఇప్పటికే సంతవీధిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఎంపీ మునిస్వామి నేతృత్వంలో స్వచ్ఛతా కార్యక్రమాలు జరిగాయన్నారు. తాలూకాలోని అన్ని దేవాలయ పరిసర ప్రాంతాలను స్వచ్ఛపరిచే అంశంపై గ్రామ పెద్దలతో చర్చించామన్నారు. ఇందుకు ప్రజలు, ఇతర సంఘాల వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సహకరించాలన్నారు. ఈ సందర్భంగా శ్రీరాముడి చిత్రంతో కూడిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మాజీ మంత్రి సుధాకర్‌ను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలతో అక్షయపాత్ర ముఖ్యుల సంక్రాంతి సంబరం

బెంగళూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల పోషణ, విద్యాభివృద్ధి కోసం లాభాపేక్ష లేకుండా సేవలందిస్తున్న అక్షయపాత్ర ఫౌండేషన్ అన్నదాతలతో కలసి సంక్రాంతి సంబరాన్ని జరిపారు. అక్షయపాత్ర ఫౌండేషన్ మధ్యాహ్న భోజనం కోసం నేరుగా రైతులు పండించిన వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. రైతులకు దళారుల ప్రమేయం లేకుండా ఆదాయాన్ని సమకూరుస్తున్నారు. ఈమేరకు రైతులతో కలసి సంక్రాంతి సంబరాలను జరిపారు. అక్షయపాత్ర ఫౌండేషన్ సీఈఓ శ్రీధర్ వెంకట్ మాట్లాడుతూ అక్షయపాత్ర ద్వారా పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. రైతులు దేశానికి వెన్నెముకలాంటివారని వారి సమక్షంలో పండుగ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. సంక్రాంతి సంబరాలను సంప్రదాయబద్ధంగా జరిపారు.



సంక్రాంతి సంబరాల్లో అక్షయపాత్ర సీఈఓ తదితరులు

ఏపీఎంసీ మార్కెట్‌లో కమీషన్ దందాను అడ్డుకోండి

చింతామణి, జనవరి 20: రాష్ట్రంలో ప్రముఖ టమోటా మార్కెట్‌లలో ఒకటైన చింతామణి పట్టణంలోని ఏపీఎంసీ టమోటా మార్కెట్ ఒకటిగా ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లో రైతుల నుంచి అధిక కమీషన్ వసూలు చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర రైతుసంఘం, హసిరుసేన రైతు సంఘం పదాధికారులు ఏపీఎంసీ మార్కెట్ కార్యదర్శికి శనివారం వినతి పత్రం సమర్పించారు. సంఘం కార్యదర్శి తాలూకా అనకల్ గ్రామానికి చెందిన శివానంద మాట్లాడుతూ అవిభాజ్య కోలారు, చిక్కబళ్లాపుర సహా పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్, తమిళనాడు నుంచి టమోటా ఇతర కూరగాయాలు ఏపీఎంసీ మార్కెట్‌కు వస్తున్నాయన్నారు. మార్కెట్‌కు వచ్చే రైతులనుంచి కమీషన్ మొత్తాన్ని భారీగా వసూలు చేస్తున్నారని ఆక్రోశం వ్యక్తం చేశారు. కూరగాయల వేలంపాటలో జాక్‌పాట్ నెపంతో రైతులను వంచిస్తున్నారన్నారు. రైతులకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేయదలిచామన్నారు. వినతిపత్రం స్వీకరించిన ఏపీఎంసీ కార్యదర్శి సునితా మాట్లాడుతూ ఇందుకు సంబంధించి ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు సీవీ జయరామ్, ఉపాధ్యక్షుడు కే శ్రీనివాస్, రాగుట్టహళ్ళి సీనప్ప, సీకల్ శ్రీనివాస గౌడ, కేవీ వెంకటరామప్ప తదితరులు పాల్గొన్నారు.



ఏపీఎంసీ కార్యదర్శి సునీతకు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

సోమేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనుల పరిశీలన

శిడ్లఘట్ట, జనవరి 20: పట్టణంలోని కోటె సర్కిల్‌లో సోమేశ్వరస్వామి దేవాలయం జీర్ణోద్ధరణ పనులను కాంగ్రెస్ నాయకుడు రాజీవ్‌గౌడ పరిశీలించారు. దేవదాయశాఖకు చెందిన పరిధిలోని ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో సుమారు రూ.1.50కోట్లతో సంస్థ అధ్యక్షుడు నాగరాజ్ నేతృత్వంలో ఆలయ పనులు సాగుతున్నాయి. ఇప్పటికే రాతితో గర్భగుడి ప్రాంగణం శిఖర నిర్మాణం, పురోహితులకు వసతి, అన్న సంతర్పణకు విశాలమైన హాల్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇంకా ఆలయ ప్రహరీగోడ నిర్మాణం చేపట్టాల్సి ఉందని ఇందుకు సుమారు రూ.75లక్షలు ఖర్చు కానుందని, దాతల సహాయ సహకారాలు కోరుతున్నట్టు నాగరాజ్ వివరించారు. ఆలయ ముఖద్వారం సహా ఇతరత్రా వాటికి తనవంతు సహకారం అందించనున్నట్టు రాజీవ్‌గౌడ హామీ ఇచ్చారు.



పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకుడు రాజీవ్‌గౌడ తదితరులు

ఖైదీలకు అయోధ్య అక్షింతలు

బెంగళూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామలల్లా విగ్రహ ప్రతిష్ఠాపన అంశం విశ్వవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఎవరికివారు రామభక్తిని చాటుకుంటున్నారు. చామరాజనగర జిల్లా జైలులో శిక్షలు అనుభవిస్తున్న ఖైదీలకు న్యాయ సేవా ప్రాధికార, జనార్ధన ఫౌండేషన్‌లు సంయుక్తంగా అక్షింతలు, జపమాల, పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. జనార్ధన ఆలయం అర్చకులు అనంత ప్రసాద్ ఖైదీలకు రామతారక అక్షింతలు అందజేశారు.



జపమాల, అక్షింతలతో ఖైదీలు తదితరులు

బెల్‌నెస్ చాంపియన్‌లో కేన్సర్ సమస్యలకు ఉచిత సేవలు

బెంగళూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బెల్‌నెస్ చాంపియన్ హాస్పిటల్‌లో గ్యాస్ట్రో ఇంటెస్టినల్ ఆంకాలజీ ఆధ్వర్యంలో కేన్సర్ సమస్యలపై సెకండ్ ఓపీనియన్ పొందేలా ఉచిత సేవలను ఆరంభించారు. డాక్టర్ విక్రమ్ జే రావ్ నేతృత్వంలోని ఆసుపత్రిలో ఉచిత సేవలను కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు నాడోజా మహేశ్‌జోషి శనివారం లాంఛనంగా ప్రారంభించారు. జెరోదా అసెట్ మేనేజిమెంట్ సీఈఓ విశాల్‌జైన్, విప్రోలో మేనేజిమెంట్ కన్సల్టెంట్ అనంత్ హెజమూడి శంకర్రావు ముఖ్యులుగా పాల్గొన్నారు. గ్యాస్ట్రో ఇంటెస్టినల్ ఆంకాలజీ క్లినిక్ సమగ్రమైన ఆధునాతన చికిత్సలు అందిస్తోందన్నారు. అయితే రెండో ఒపీనియన్ ద్వారా రోగుల సందేహాలను తీర్చడం కీలకం కానుందన్నారు. బెల్‌నెస్ కో ఫౌండర్‌లు డాక్టర్ మంజునాథ్, సీఈఓ డాక్టర్ శశిధర్‌లు పాల్గొన్నారు.



ఉచిత సేవలను ప్రారంభిస్తున్న నాడోజా మహేశ్‌జోషి తదితరులు

బెంగళూరు ఉత్తరలో రూ.525 కోట్లతో నిర్మాణాలు

బెంగళూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చెందుతున్న బెంగళూరులో అన్ని వర్గాలకు సొంతింటి కల సాకారం చేసే దిశగా బెంగళూరు ఉత్తరప్రాంతంలో 525 కోట్ల రూపాయలతో నిర్మాణాలు చేపట్టదలిచినట్టు కాన్‌కార్డ్ రియల్ సంస్థ ప్రకటించింది. ఈమేరకు శుక్రవారం కాన్‌కార్డ్ చైర్మన్ నేసర బీఎస్ ప్రకటించారు. యలహంక, సర్జాపుర, మాలూరు, థణిసంద్ర, విద్యారణ్య పుర ప్రదేశాలలో నిర్మాణాలు చేపట్టదలిచామన్నారు. 7లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 2, 3, 4 బీహెచ్‌కేలతో అత్యాధునిక సౌలభ్యాలు ఉండేలా నిర్మాణాలు చేపడతామన్నారు.

మడమ నొప్పికి తగిన చికిత్సలు పొందాలి

బెంగళూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కాలిలో మడమనొప్పులకు వెంటనే తగిన చికిత్సలు పొందాలని, నిర్లక్ష్యం చేయరాదని అపోలో స్పెక్ట్రా ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సురేశ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. మడమ నొప్పుల నివారణపై ఆయన శనివారం ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేశారు. సుదీర్ఘకాలం విశ్రాంతి తర్వాత వాకింగ్ ప్రారంభించినప్పుడు మడమ నొప్పులు తలెత్తుతాయన్నారు. దైనందిక కార్యకలాపాలపై మడమ నొప్పులు తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. మడమనొప్పులు నిర్లక్ష్యం చేస్తే ఇతరత్రా సమస్యలకు కారణం కానున్నాయన్నారు. ఎక్స్‌రే, ఎంఆర్‌ఐ వంటి పరీక్షల ద్వారా సమగ్రతను గుర్తించవచ్చునన్నారు. నివారణకు ఫిజియోథెరపీ కూడా కీలకంగా పనిచేయనుందన్నారు. స్టెమ్‌సెల్ థెరపీ తీవ్రతను బట్టి పొందవచ్చునన్నారు. నిరంతరంగా మడమనొప్పులు ఉన్నవారు తగిన వైద్య సలహాలతో ముందుకెళ్లాలన్నారు.

రోడ్డు విస్తరణపై చర్చలు



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి తదితరులు

మహదేవపుర, జనవరి 20: నియోజకవర్గంలోని పణత్తూరు ఎస్ క్రాస్ రోడ్డు విస్తరణకు సంబంధిత ప్రైవేట్ స్థలాల యజమానులు, అధికారులతో ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి సమావేశం నిర్వహించారు. రోడ్డుకు అనుబంధంగా ఉన్న ప్రైవేట్ స్థలాల యజమానులతో చర్చించి రోడ్డు విస్తరణకు అవకాశం కల్పించేలా అంగీకరింపచేశారు. స్థలాలు కోల్పోయేవారికి ఇప్పటికే పరిహారమొత్తం అందేలా చర్యలు చేపట్టారు. మిగిలినవారికి కూడా త్వరగా అందేలా అధికారులకు సూచించారు. సమావేశంలో మహదేవపుర టాస్క్‌ఫోర్స్ అధ్యక్షుడు, మాజీ మంత్రి అరవింద లింబావళి, పట్టణ బీజేపీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, మహదేవపుర టాస్క్ ఫోర్స్ పదాధికారులు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

కాలువలను పట్టించుకోండి



కాలువలో చెత్తా చెదారం పేరుకుపోయిన తీరు

చేళూరు, జనవరి 20: తాలూకా పరిధిలోని బురుడుగుంట గ్రామపంచాయతీ కేంద్రంలో మురుగుకాలువల నిర్వహణను పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టడం ద్వారా స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. ఇందుకు సంబంధించి నిధులు మంజూరైనా అమలు కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాలువలలో పూడిక తీయకపోవడంతో మురుగునీరు సజావుగా ప్రవహించక దుర్గంధం వెదజల్లుతోందని, దోమల బెడద ప్రబలుతోందని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పీడీఓ ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నకిలీ వీసా, పాస్‌పోర్టు... ఎయిర్‌పోర్టులో వ్యక్తి అరెస్టు

బెంగళూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నకిలీ వీసాతో పాటు పాస్‌పోర్టు కలిగిన సాదికుల్లా బేగ్ అనే వ్యక్తిని బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేశారు. దుబాయ్ నుంచి బెంగళూరుకు వచ్చిన సాదికుల్లాను గురువారం అరెస్టు చేయగా ఢిల్లీ పోలీసులకు అప్పగించారు. పంజాబ్ రాష్ట్రం లుధియానాలో జరిగిన నకిలీ వీసా వివాదానికి సంబంధించి సాదికుల్లాపై లుక్‌అవుట్ నోటీసులు జారీలో ఉన్నాయి. సాదికులా బెంగళూరు ఎయిర్‌పోర్టుకు చేరుకోగానే పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు డీసీపీ ఉషారంగనాణి వెల్లడించారు. నకిలీ వీసా వివాదంకు సంబంధించి లుధియానాకు చెందిన హర్విందర్‌సింగ్ ధనోవా కొన్ని నెలల కిందట ఏజెంట్ ముస్కాన్ ఉర్ఫ్ మన్‌ప్రీత్‌కౌర్ సమకూర్చిన వీసా ద్వారా కెనడా నకిలీ వీసా ద్వారా ప్రయాణిస్తుండగా పట్టుబడ్డారు. అతడు ఇచ్చిన సమాచారంతో మరో ఏజెంట్‌గా వ్యవహరించిన సాదికుల్లాకు ఐదు లక్షలు ఇచ్చినట్లు హర్విందర్ సింగ్ తెలిపారు. సుదీర్ఘకాలంగా సాదికుల్లా కోసం ఢిల్లీ పోలీసులు గాలింపులు జరుపుతున్నా ఆచూకీ లభించకపోవడంతో లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. దుబాయ్ నుంచి బెంగళూరుకు చేరుకోగానే సాదికుల్లాను అదుపులోకి తీసుకుని ఢిల్లీ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఓ బృందంగా వచ్చి తరలించారు.